సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 23 | ఏప్రిల్ | 2024



సమ్మయ్యకు పద్మశ్రీ ప్రదానం

జనగామ జిల్లా దేవరుప్పులకు చెందిన చిందు, యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య సోమవారం రాత్రి ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. ప్రధాని మోదీ అభినందించారు. - దేవరుప్పుల



న్యూస్‌రీల్

బాక్సింగ్ ఎంపిక పోటీలకు 10 మంది హాజరు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్ నందు ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి మెన్, ఉమెన్ ఎంపిక పోటీలకు 10 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగిన ఈఎంపికలో 9 మంది బాలురు, ఒక బాలిక హాజరైనట్లు హనుమకొండ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి పోతరాజు రాజేందర్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈనెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ బూజుగుండ్ల రవీందర్‌కుమార్, జనరల్ సెక్రటరీ కమలాకర్, సలహాదారులు పుప్పాల ప్రభాకర్, సదానందం, బాక్సింగ్ కోచ్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

పోర్ట్ ఫోలియో జడ్జిని కలిసిన 'బార్' నాయకులు



వరంగల్ లీగల్: వరంగల్, హనుమకొండ జిల్లాల పోర్ట్‌ఫోలియో జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యను సోమవారం వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జీవన్‌గౌడ్, మహమ్మద్ ముదస్సిర్ ఖయ్యూమి, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాతంగి రమేశ్‌బాబు, ఎల్.రమేశ్ నేతృత్వంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు వేర్వేరుగా కలిసి పూలమొక్క అందించి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్దన్, వరంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుదర్శన్, జాయింట్ సెక్రెటరీ హరిహర కుమార్, గోపిక రాణి, కోశాధికారి శంకరా చారి, సెక్రెటరీలు మురళీకుమార్, వెంకటరమణ, ఈసీ మెంబర్లు సాంబశివరాజు, రాజేందర్, మాలతి, విక్రమ్, అనిల్‌కుమార్, అశోక్, శృతి, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పోశాని రవీందర్, జాయింట్ సెక్రెటరీలు విజేందర్, స్వప్న, సంపత్, చిరంజీవి, కోశాధికారి సదానందం, ఈసీ మెంబర్లు శ్రీనివాస్, అనిత, రుత్విక్, సుహాస్, అనిల్ లాల్ నాయక్, అచ్యుత్‌కుమార్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్ : పాతకక్షల కారణంగా కత్తితో పొడిచి హత్య చేసిన హసన్‌పర్తి మండలం చింతగట్టుకు చెందిన ఆటోడ్రైవర్ జనగాని సృజన్‌కు నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతోపాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ సోమవారం వరంగల్ జిల్లా రెండో అదనపు (ఎస్సీ, ఎస్టీ కేసుల) కోర్టు జడ్జి మనీషా మెహరా తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. చింతగట్టుకు చెందిన నద్దునూరి మురళి, జనగాని సృజన్ ఆటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. మురళి తన వదినతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని ఆటో అడ్డా వద్ద పలువురు గుసగుసలాడుతుండగా అది విన్న సృజన్ కోపంతో మురళిపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో తన వదిన 2017 జూలైలో సిద్దాపురంలోని తల్లిగారింటికి వెళ్లగా, మురళి కూడా అక్కడికి వెళ్లి వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా తన వదిన తమ్ముడైన సునిల్‌కుమార్‌కు పట్టుబడ్డాడు. ఈ విషయంపై పెద్దమనుషులు పంచాయితీ చేసి సంబంధం కొనసాగించవద్దని హెచ్చరించి తీర్మానించారు. అయినా మురళి తన ప్రవర్తన మార్చుకోలేదు. దీంతో మురళిని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్న సృజన్ సరైన అవకాశం కోసం వేచి చూశాడు. 2017 నవంబర్ 11న మురళిని చంపాలని పథకం వేసుకున్న సృజన్ చింతగట్టు నుంచి కల్లు గీసే కత్తిని వెంట తీసుకొని నగరంలోని కిషన్‌పుర ఆటో అడ్డా వద్దకు వచ్చాడు. అక్కడే ఉన్న మురళిని రెచ్చగొట్టి దుర్భాషలాడాడు. దీంతో ఆటోలో ఉన్న మురళి బయటకి రాగా, సృజన్ తన వెంట తెచ్చుకున్న కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి మనీషా మెహరా నిందితుడు సృజన్‌కు జీవిత ఖైదు, రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసును అప్పటి ఏసీపీ కె.రాజేందర్, హనుమకొండ ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ విచారించగా, సాక్ష్యులను కె.పరమేశ్వరి, కానిస్టేబుల్ ఎం.సుభాష్ కోర్టులో హాజరుపర్చారు.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గల్లంతు

- బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్‌ను గెలిపించాలి
- కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు



ఆదివాసీ కళాకారుల కొమ్ము కిరీటాలతో కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు, అభ్యర్థి సీతారాం నాయక్

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ ఒక వర్గానికి ప్రాధాన్యం ఇచ్చి మిగతా వర్గాలను విస్మరించిందని పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి కాంగ్రెస్ గల్లంతవుతుందని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కిరెణ్ రిజిజు అన్నారు. మానుకోట పార్లమెంట్ స్థానంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్‌ను గెలిపించాలని కోరారు. అజ్మీరా సీతారాం నాయక్ నామినేషన్ సమర్పించిన నేపథ్యంలో సోమవారం కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు ముఖ్య అతిథిగా ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో మానుకోట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియం సమీపానికి చేరుకున్నారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సెంటర్‌లో సభ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత 70 ఏళ్లుగా దేశంలో పరిష్కారం కాని ఎన్నో సమస్యలను మోదీ సర్కార్ పరిష్కరించిందన్నారు. మోదీ అంటే గ్యారంటీ అని, ప్రజలు ఆలోచన చేస్తున్నారని, దేశం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందని, ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తోందన్నారు. ఆదివాసీ, గిరిజన మహిళలను రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని, ఉద్యోగం, రాజకీయం ఇతర రంగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. సీతారాంను ఎంపీగా గెలిపిస్తే మానుకోటలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో జిల్లా యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. దేశాభివృద్ధి కోసం మూడోసారి మోదీని ప్రధాని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్, మాజీ రాజ్యసభ, బీజేపీ కేంద్ర కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, క్రమశిక్షణ సంఘం చైర్మన్ ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

50వేల మెజార్టీతో విజయం

- కడియం శ్రీహరికి నేనే రాజకీయ జీవితం ఇచ్చా
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



మాట్లాడుతున్న ఎర్రబెల్లి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్, వినయ్‌భాస్కర్, రాజయ్య

హన్మకొండ/కాజీపేట సెంటర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ సోమవారం నామినేషన్ వేసిన సందర్భంగా హనుమకొండ బాల సముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయం నుంచి ఏకశిల పార్కు వరకు భారీ ర్యాలీ తీశారు. ర్యాలీలో, నామినేషన్ వేసిన అనంతరం విలేకరులతో ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. తాను సర్వే చేయించానని, రంగంలోకి దిగకముందే 50 వేల మెజార్టీతో గెలుస్తాన్నారని ప్రచారం చేపడితే మెజార్టీ మరింత పెరుగుతుందన్నారు. పార్టీ పరంగా లాభం పొంది బయటకు వెళ్లిన నాయకులను తిరిగి చేర్చుకునేది లేదని, ఈవిషయంపై పార్టీ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వద్ద మాట తీసుకున్నానన్నారు. తనను కేసుల్లో ఇరికించాలని చూస్తున్నారని, వారికి ఎలాంటి ఆధారాలు దొరకడం లేదన్నారు. కడియం శ్రీహరికి తానే రాజకీయ జీవితమిచ్చానన్నారు. రేవంత్‌రెడ్డి బ్రోకర్ అయితే కడియం శ్రీహరి మోసకారి అని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. కేసీఆర్‌ను బ్లాక్ మెయిల్ చేసి బిడ్డకు టికెట్ ఇప్పించి వంచించిన మోసగాడు కడియం శ్రీహరి అని ధ్వజమెత్తారు. శ్రీహరిని చూసి ఊసరవెల్లి సిగ్గుపడుతుందని విమర్శించారు. ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. తాను స్థానికుడ్నే అని, కడియం కావ్య గుంటూరుకు చెందిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు, వినయ్‌భాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ బిడ్డగా.. ఆదరించండి

- 35 ఏళ్ల తరువాత మహిళకు అవకాశం
- కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ కడియం కావ్య, చిత్రంలో సాంబయ్య, ఎమ్మెల్యేలు

కాజీపేట సెంటర్: '35 ఏళ్ల తర్వాత వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా మహిళకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చింది. మీ ఇంటి ఆడబిడ్డగా ఆదరించి గెలిపించాలి' అని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్యకు తన నామినేషన్ సెట్ పత్రాన్ని దాఖలు చేశారు. అనంతరం కావ్య మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా మహిళా ఓటర్లున్నారని, గతంలో మహిళల సమస్యల పరిష్కారానికి పని చేశానన్నారు. విద్య, ఆరోగ్యం కోసం అధిక ప్రాధాన్యమిస్తానన్నారు. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలైన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ అప్ గ్రేడ్ లెదర్ పార్క్ చేయడానికి కృషి చేస్తానన్నారు. ఎడ్యుకేషన్, ఐటీ హబ్‌గా అండర్ డ్రెయినేజీ వ్యవస్థను తీర్చిదిద్దడానికి పని చేస్తానని హామీ ఇచ్చారు. ఇతర పార్టీల నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ.. రాజ్యాంగాన్ని మార్చాలంటున్నారు వారి మాటలు నమ్మకుండా తన గెలుపు కోసం అందరు సహకరించాలని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కావ్య కోరారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, సీనియర్ నాయకుడు దొమ్మాటి సాంబయ్య మాట్లాడుతూ.. కులాలు, మతాల పేరుతో నిరుద్యోగులు, రైతులను పొట్టన పెట్టుకున్న పార్టీ బీజేపీ అన్నారు. 120 రోజుల తమ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకులు నిందలు మోపుతూ 10 ఏళ్ల పాలనలో అన్ని రకాలుగా ప్రజలను, నిరుద్యోగ యువతను మోసం చేసింది మర్చిపోయారా అని ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే.. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సీనియర్ నాయకుడు ఈవీ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

వరుస సభలు.. ప్రచార హోరు!

అగ్రనేతల ఆగమనం.. ఊపందుకున్న ప్రచారం

- ప్రధాన పార్టీల అభ్యర్థులకు మద్దతుగా నేతలు...
- నేడు వరంగల్‌లో కేటీఆర్ సభ.. రేపు సీఎం రేవంత్ రెడ్డి రాక
- మరోవైపు బీజేపీ కేంద్రమంత్రులు.. పోటాపోటీగా అగ్రనేతల సభలు



లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ రాజకీయ పార్టీల పోరుగల్లుగా మారింది. నామినేషన్ల ఘట్టం 25న ముగియనుండగా.. అప్పుడే పార్లమెంట్ స్థానాల పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీల అగ్రనేతల ప్రచార సభలు హోరెత్తుతున్నాయి. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు చెందిన అగ్రనేతలు.. అభ్యర్థుల గెలుపు కోసం సర్వశక్తులొడ్డేందుకు రోడ్‌షోలు, బహిరంగ సభల షెడ్యూల్‌లను ప్రకటించారు. ఇప్పటికే విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. గెలుపే లక్ష్యంగా ఓవైపు అభ్యర్థులు నిత్యం నియోజకవర్గాల్లో అలుపెరగకుండా తిరుగుతుండగా.. మరోవైపు జోష్ పెంచేందుకు అగ్రనేతలతో బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు.

సాక్షిప్రతినిధి, వరంగల్

ఈ నెల 18న లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా.. ఆ మరుసటి రోజు నుంచే అగ్రనేతల ప్రచార సభలు మొదలయ్యాయి. 19న మహబూబాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ నామినేషన్ సందర్భంగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి.. ఉమ్మడి వరంగల్‌లో ఎన్నికల శంఖారావం పూరించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ అగ్రనేతల షెడ్యూల్ కూడా మానుకోటలో ఖరారయ్యింది. మే 1న మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మానుకోటలో రోడ్‌షో నిర్వహించనున్నారని ఆ పార్టీ ప్రకటించింది. బీజేపీ తరఫున కేంద్రమంత్రి అమిత్‌షా పాల్గొననున్నట్లు వెల్లడించారు. అలాగే వరంగల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్ తరఫున ప్రచారం నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నేడు (మంగళవారం) వరంగల్‌లో పర్యటించనున్నారు. మరుసటి రోజు, ఈ నెల 24న సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య తరఫున ప్రచారం చేసేందుకు వరంగల్‌కు రానున్నారు. 28న కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, అమిత్‌షాలు బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోసం రోడ్‌షో, సభలు నిర్వహించనున్నట్లు పార్టీవర్గాలు ప్రకటించాయి. కాగా 25న నామినేషన్ల పర్వం ముగియనుండగా 29న ఉపసంహరణ అనంతరం గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పత్రాలు విడుదల కానున్నాయి. ఆ తర్వాత సుమారు 14 రోజులు ప్రచారం నిర్వహించే అవకాశం ఉండగా.. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు, బీజేపీ తరఫున పీఎం నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్‌షా, అశ్విన్ వైష్ణవ్, సీఎం ఆదిత్యనాథ్ యోగి తదితరులు, బీఆర్‌ఎస్ నుంచి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, తదితరులు ప్రచారాన్ని హోరెత్తించనున్నారని ఆయా పార్టీలు ప్రకటించాయి.

నేడు వరంగల్‌కు కేటీఆర్..

వరంగల్ బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ తరఫున ప్రచారం నిర్వహించేందుకు మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) మంగళవారం వరంగల్‌లో పర్యటించనున్నారు. అలంపూర్ నుంచి హెలికాప్టర్ ద్వారా సాయంత్రం 4.30 గంటలకు సుబేదారి పరిధిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానానికి చేరుకోనున్న కేటీఆర్.. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో హంటర్‌రోడ్డులోని డి-కన్వెన్షన్‌కు వెళ్తారు. అక్కడ ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం ఉర్సుగుట్టలోని నాని గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో పాల్గొని.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు వెళ్తారు.

నామినేషన్ల సందడి

- వరంగల్ పార్లమెంట్ స్థానానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు
- మహబూబాబాద్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ దాఖలు..
- తొలిసెట్ సమర్పించిన సుధీర్ కుమార్, కడియం కావ్య

8లో▶

ఎస్‌ఏ-2 పరీక్షలు ప్రశాంతం

నేడు పేరెంట్స్ మీటింగ్

- రేపట్నుంచి సెలవులు
- జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం

విద్యారణ్యపురి: అన్ని యాజమాన్యాల పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, గురుకులాల్లో 1 నుంచి 9వతరగతి విద్యార్థులకు సమ్మిటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-2) పరీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈపరీక్షల నిర్వహణను డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, జిల్లా పరీక్షల బోర్డు (డీసీఈబీ) సెక్రటరీ డాక్టర్ బి.రాంధన్ పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు మూల్యాంకనం పూర్తి చేసి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో మార్కులు అప్‌లోడ్ చేస్తారు. ఆయా ప్రగతి పత్రాలను క్యూమిలేటివ్ రికార్డులు (ప్రొగ్రెస్ కార్డులు) సంబంధిత విద్యాశాఖ వెబ్‌సైట్‌లోనుంచి ఈనెల 23న డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

నేడు పేరెంట్స్ మీటింగ్

ఈనెల 23న పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలని డీఈఓ ఎండీ అబ్దుల్‌హై హెచ్‌ఎంలను ఆదేశించారు. విద్యార్థులకు మార్కులతో కూడిన ప్రగతిపత్రాలను తల్లిదండ్రుల సమక్షంలోనే అందించి చర్చించాలన్నారు. పాఠశాలలకు ఈనెల 24 నుంచి జూన్ 11 వరకు సెలవులిచ్చారు. ఈ సెలవుల్లో విద్యార్థులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు మంగళవారం తెలియజేస్తారు.

విద్యార్థులకు సూచనలు..

- ఎండల కారణంగా విద్యార్థులు ఆరుబయట ఉదయం, సాయంత్రం మాత్రమే ఆడుకోవాలి. మధ్యాహ్నం వేళ ఎండలో ఆడుకోవద్దు.
- చెరువులు, కుంటలు, బావుల వద్దకు పెద్దల పర్యవేక్షణ లేకుండా వెళ్లొద్దు.
- తరచూ నీళ్లు తాగాలి. ఇంట్లోని తాజా ఆహారాన్ని మాత్రమే భుజించాలి.
- శరీరానికి గాలి తగిలేలాపలుచని కాటన్ దుస్తులు ధరించాలి. బయటికి వెళ్లినప్పుడు గొడుగు లేదా టోపీ ధరించాలి. మంచి నీళ్ల సీసాను వెంట తీసుకెళ్లాలి.
- వీలైనన్ని కథల పుస్తకాలు చదవాలి.
- బొమ్మలు, పేయింటింగ్ వేయాలి.
- అభిరుచి మేరకు అందుబాటులో ఉన్న వస్తువులతో క్రాఫ్ట్ వర్క్ చేయాలి.
- తగినంత విశ్రాంతి తీసుకోవాలి.

తల్లిదండ్రులకు సూచనలు..

పిల్లలతో తప్పని సరిగా మాట్లాడాలి. వారి రోజు ఎలా గడిచింది తెలుసుకోవాలి. వారికి సంతోషం, బాధ, కోపం కలిగించిన ఘటనలేంటి? తదితర విషయాల గురించి మాట్లాడాలి.

- పిల్లలు ఫోన్లు, టీవీతో గడిపే సమయాన్ని వీలైనంత తగ్గించాలి.
- రోజువారి కార్యక్రమాల్లో పిల్లల్ని భాగస్వాముల్ని చేయాలి.
- పిల్లలతో కలిసి ఆడుకోవాలి. వారికి కథలు చెప్పాలి. వారు చెప్పినవి వినాలి.
- వంటకు సంబంధించి తేలికైనా పనుల్లో పిల్లల్ని భాగస్వాముల్ని చేయాలి.

సెలవుల్ని వినియోగించుకోవాలి..



వేసవి సెలవులను విద్యార్థులు వినియోగించుకోవాలి. అందుకు తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయులు చెప్పినట్లుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తల్లిదండ్రుల సమావేశంలో చెప్పే విషయాలను అవగాహన చేసుకొని ఆయా జాగ్రత్తలను పాటించాలి. జూన్ 12నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతాయి.

- ఎండీ అబ్దుల్‌హై, డీఈఓ

స్మార్ట్ సిటీ పనుల్ని వేగంగా చేపట్టండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల్ని వేగంగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. నగర పరిధి పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్ని క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర, హెచ్‌ఓ రమేశ్, ఈఈలు శ్రీనివాస్, సంజయ్‌కుమార్, డీఈలు రవికిరణ్, సారంగం, కృష్ణమూర్తి, ఏఈ మోజామిల్, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, స్మార్ట్ సిటీ ప్రతినిధులు ఆనంద్ ఓలేటి, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

పన్ను రిబేట్‌ను వినియోగించుకోండి..

ఈనెల 30వ తేదీలోగా ఆస్తి పన్ను చెల్లించి 5 శాతం పన్ను రిబేట్‌ను పొందాలని గ్రేటర్ వరంగల్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, డిప్యూటీ కమిషనర్ రవీందర్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం వరంగల్‌లోని రత్న హోటల్ యాజమాన్యం రూ. 4.50 లక్షలు, హనుమకొండ శ్రీదేవి ఏషియన్ మాల్ యజమానులు రూ. 12.3 లక్షలు చెక్కులను అధికారులకు అందజేశారు. డిప్యూటీ కమిషనర్ కష్టారెడ్డి రెవెన్యూ అధికారులు యూసుఫొద్దీన్, షహజాదీ బేగం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సోహైల్, భరత్ చంద్ర, శ్రీకాంత్ , బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.



ముందస్తు ఆస్తి పన్ను రిబేట్ చెక్కులు స్వీకరిస్తున్న బల్దియా అధికారులు

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలందించాలి

వరంగల్ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

ఎంజీఎం: మాతాశిశు సంరక్షణలో భాగంగా ప్రతీ గర్భిణీ పేరు నమోదు చేసి వారికి ప్రభుత్వ పరంగా మెరుగైన వైద్యసేవలందించాలని వరంగల్ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ సూచించారు. వరంగల్‌లోని ఐఎంఏ హాల్‌లో వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులకు ప్రణాళికాబద్ధంగా వైద్యం అందిస్తూ మానసికంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి సేవలు పొందేలా వారికి, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. మాతా శిశు మరణాలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులకు సూచించారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతున్నందున వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ ప్రజలకు సూచించారు. శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడంతో తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండిపోవడం, శరీరంలోని నీటి శాతం కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లి శరీరాన్ని చల్లని నీటిలో తడిపిన గుడ్డతో తుడవాలన్నారు. వారికి మజ్జిగ, చల్లని కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, గ్లూకోజ్ ద్రావణాన్ని తాగించి సమీప ఆస్పత్రికి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ సుందర్‌సింగ్, డాక్టర్ విజయ్‌కుమార్, డీఐఓ ప్రకాశ్, ఆచార్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

ఓపెన్ పరీక్షల్ని పకడ్బందీగా నిర్వహించాలి

డీఈఓ ఎండీ అబ్దుల్‌హై

విద్యారణ్యపురి: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు హనుమకొండ జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ ఎండీ అబ్దుల్‌హై కోరారు. జిల్లాలో ఈనెల 25 నుంచి మే 2 వరకు జరగబోయే ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణకు నియమితులైన సీఎస్‌లు, డీఓలతో సోమవారం హనుమకొండలోని డీఈఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు తీసుకురావొద్దన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యానికి కార్యశాల తోడ్పాటు


నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో కార్యశాల పేరిట నిర్వహిస్తున్న వర్క్‌షాపులు విద్యార్థుల్లో, అధ్యాపకుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు తోడ్పడతాయని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ అన్నారు. నిట్‌లో సోమవారం సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్, మెకానికల్ డిపార్ట్‌మెంట్ సౌజన్యంతో 'అడిటివ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, పోస్ట్ ప్రాసెసింగ్ ఆఫ్ అడిటివ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ పార్ట్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ కంప్యూటేషనల్ టెక్నిక్స్' అంశంపై నిర్వహిస్తున్న వారం రోజుల కార్యశాలను జ్యోతి ప్రజ్వలన చేసి నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ ప్రారంభించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు, నూతన ఆవిష్కరణలతోపాటు అధ్యాపకులు అత్యుత్తమ బోధన అందించేందుకు వర్క్‌షాపులకు తప్పకుండా హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ జీఎల్.సామ్యూల్, ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ ఎస్‌కే.పాల్, నిట్ మెకానికల్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ సురేశ్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ షెడ్యూల్ ఖరారు



కాజీపేట : ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి షెడ్యూల్ ఖరారైంది. వీరికి మే 5 నుంచి 7వ తేదీ వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. 5న పీఓలు, ఏపీఓలు, సూక్ష్మ పరిశీలకులుగా విధులు నిర్వహించే వారు.. వారు పనిచేసే నియోజకవర్గ కేంద్రాల్లో ఓటు వేసేలా ఏర్పాట్లు చేశారు. 6న ఏపీఓలు, 7న పోలీసు, ఎన్నికల విధులు నిర్వహించే ఇతర శాఖల ఉద్యోగులు ఓటు వేయాలని నిర్ణయించారు. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



బోండా.. రండా.. మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ సోమవారం నామినేషన్ దాఖలు సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సమయంలో ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందడానికి కొబ్బరి బోండా తాగుతున్న కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు

అన్నా.. కండువా కప్పుకో..

వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సమయంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పార్టీ కండువా కప్పుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, డీసీసీ హనుమకొండ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024



నగరంలో వాహనాల తనిఖీ

- రూ.3.39 లక్షలు స్వాధీనం



బ్యాగు తనిఖీ చేస్తున్న పోలీసులు

రామన్నపేట : వరంగల్ ఏసీపీ బి.నందిరాం ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని పోచమ్మ మైదాన్ ప్రాంతంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో ఆధారాలు లేకుండా తరలిస్తున్న వరంగల్ బ్యాంక్ కాలనీకి చెందిన కేదియా ప్రతీక్ నుంచి రూ. 2.73 లక్షలు, తాటికొండ రవికాంత్ నుంచి రూ.66 వేలు.. మొత్తం రూ.3.39 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకుని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జ్‌కు అప్పగించారు. ఈ తనిఖీల్లో మట్టెవాడ, మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్లు టి.గోపి, పి.మల్లయ్య, ఎం.శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పదంగా బీఫార్మసీ ప్రాక్టికల్స్!

- పరీక్షలు నిర్వహిస్తుండగా రిజిస్ట్రార్ తనిఖీ
- విద్యార్థుల నుంచి రికార్డులు, ఆన్సర్ బుక్‌లెట్లు తీసుకెళ్లి అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధికకు అప్పగింత

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ మూడో సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 18న ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తుండగా రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఆ కళాశాలను సందర్శించారు. ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న ల్యాబ్‌లోనికి వెళ్లి చూడగా పలువురు విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు సంబంధించిన రికార్డులు కలిగి ఉండడాన్ని గమనించి వెంటే ఆయా విద్యార్థుల నుంచి రికార్డులు, ఆన్సర్ షీట్లను తీసుకొని వెళ్లిపోయారు. సుమారు 10మంది విద్యార్థుల రికార్డులను అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధికకు అదే రోజు అప్పగించారు. ఈవిషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రాక్టికల్స్ లో ఇచ్చే ప్రయోగ పరీక్షను పూర్తిచేశాకే అందుకు సంబంధించిన జవాబులను ఆన్సర్ షీట్‌లో రాయాల్సింటుంది. అయితే రికార్డులు విద్యార్థులు దగ్గర ఉండడంతో ప్రాక్టికల్స్ చేయకుండానే రికార్డులు చూసి రాస్తున్నారా అనే అనుమానంతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ఆయా విద్యార్థుల నుంచి ప్రాక్టికల్స్ రికార్డులు, ఆన్సర్ బుక్‌లెట్లు తీసుకెళ్లారు. దీంతో ఆయా విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలు ఆరోజు నిలిచిపోయాయి.

ప్రాక్టికల్స్ పరీక్ష రద్దు: మళ్లీ ప్రైవేట్ కాలేజీలో నిర్వహణ

ఈనెల 18న జరిగిన ఒక బ్యాచ్ మొత్తం విద్యార్థుల ప్రాక్టికల్స్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డాక్టర్ రాధిక నిర్ణయించారు. అయితే ప్రాక్టికల్స్ పరీక్షను సోమవారం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫార్మసీ కళాశాలలో సెంటర్‌లో నిర్వహించడం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. బ్యాచ్ మొత్తం 31మంది విద్యార్థులు ఉండగా అందులో ఎవరివైతే ప్రాక్టికల్స్ రికార్డులు, బుక్‌లెట్లు తీసుకెళ్లారో ఆయా విద్యార్థులకే ఈ ప్రాక్టికల్స్ పరీక్షను మళ్లీ నిర్వహించారని సమాచారం. అయితే కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధికను వివరణ కోరగా ఈనెల 18న బీఫార్మసీ మూడో సెమిస్టర్ పరీక్షలను హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సోమవారం నిర్వహించామని వివరణ ఇచ్చారు. కాగా తాను ఆ బ్యాచ్ మొత్తం విద్యార్థులకు పరీక్ష నిర్వహించాలని చెప్పామని కేవలం 10మందికే ప్రాక్టికల్స్ పరీక్షకు తీసుకెళ్లి నిర్వహించారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఆ బ్యాచ్‌లో ఎంతమంది ఉంటే అందరికీ ప్రాక్టికల్స్ నిర్వహించాలని సోమవారం మళ్లీ యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీ సంబంధిత అధ్యాపకుడిని ఆదేశించామని తెలిపారు. ఈ విషయంపై పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.

వడదెబ్బతో బీఆర్‌ఎస్ నాయకుడి మృతి



కొమురయ్య(ఫైల్)

గార్ల: వడదెబ్బతో గార్లకు చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు మోడెం కొమురయ్య(67) మృతిచెందారు. ఆదివారం మధ్యాహ్నం గార్లలో ఓ శుభకార్యానికి వెళ్లగా అక్కడ వడదెబ్బ తగలింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. సోమవారం తెల్లవారుజామున మార్నింగ్ వాక్‌కు వెళ్లి వచ్చి ఇంట్లోనే మృతి చెందాడు. కాగా, కొమురయ్య మృతదేహాన్ని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, పి రాధాకృష్ణ, టీపీసీసీ సభ్యుడు రావూరి వెంకట్రామయ్య, తాళ్లపల్లి కృష్ణగౌడ్, శంషాద్‌బేగం, కందునూరి శ్రీనివాసరావు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుబూతి తెలిపారు.

పలిమెలలో మహిళ..

పలిమెల : వడదెబ్బతో మండల కేంద్రానికి చెందిన కుమ్మరి అనిత (45) మృతి చెందింది. వారం రోజుల నుంచి కూలీ పనికి వెళ్లిన అనిత.. వడదెబ్బకు గురైంది. తీవ్ర అస్వస్థతతో ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త తిరుపతి ఉన్నారు. మృతురాలి అత్త చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు.

నామినేషన్ల సందడి..



నామినేషన్ వేస్తున్న బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్, చిత్రంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సారయ్య



నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, చిత్రంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కే.ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, దొమ్మాటి సాంబయ్య



మహబూబాబాద్ : నామినేషన్ వేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్, చిత్రంలో గంట రవికుమార్, యలమంచిలి వెంకటేశ్వర్‌రావు తదితరులు

దాఖలు చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు

- వరంగల్ పార్లమెంట్ స్థానానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు
- మహబూబాబాద్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ దాఖలు..
- తొలిసెట్ సమర్పించిన సుధీర్ కుమార్, కడియం కావ్య
- నేతలతో కలిసి కలెక్టర్‌కు సమర్పణ

సాక్షి, వరంగల్/మహబూబాబాద్: వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల్లో నామినేషన్ల సందడి నెలకొంది. ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. వరంగల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు డాక్టర్ కడియం కావ్య, ఆయుర్వేదిక్ వైద్యుడు మారేపల్లి సుధీర్ కుమార్‌తో పాటు మరో ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో హనుమకొండలోని వరంగల్ కలెక్టరేట్ (రిటర్నింగ్ అధికారి కార్యాలయం) వద్ద వివిధ రాజకీయ పార్టీ నేతల సందడి కనిపించింది. తొలుత బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సుధీర్ కుమార్ బాలసముద్రం ఏకశిలా పార్క్ వద్దకు ర్యాలీగా వచ్చిన అనంతరం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌తో కలిసి నామినేషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆ పార్టీ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, సీనియర్ నాయకుడు దొమ్మాటి సాంబయ్యతో కలిసి తన నామినేషన్ పత్రం కలెక్టర్ ప్రావీణ్యకు సమర్పించారు. గంటల వ్యవధిలోనే వీరిద్దరూ నామినేషన్లు సమర్పించారు. ఉదయం 11.40 గంటల సమయంలో సుధీర్ కుమార్, మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో కడియం కావ్య తమ తొలిసెట్ నామినేషన్లు దాఖలు చేశారు. కాగా, నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన మొదటి, రెండో , మూడో, నాలుగో రోజు కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 19మంది అభ్యర్థులు 22 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య తెలిపారు. వీరిలో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మేకల సుమన్ మరో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు.

నామినేషన్ల కోలాహలం..

- పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మారేపల్లి సుధీర్ కుమార్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యకు ఒక సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు.
- కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య కూడా ఒక సెట్ నామినేషన్ పత్రం సమర్పించారు.
- స్వతంత్ర అభ్యర్థులుగా తాళ్లపల్లి వెంకటయ్య, మందా నరేష్, బొచు రాజు, శనిగరపు రమేష్ , పొంగుల అశోక్ ఒక సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు.
- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా ఇసంపల్లి వేణు ఒక సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు.
- ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మేకల సుమన్ మరో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు
- విదు థలై చిరు థైగల్ కాచి పార్టీ అభ్యర్థిగా మచ్చ దేవేందర్ ఒక సెట్ నామినేషన్ వేశారు.

మానుకోటలో మూడు నామినేషన్లు..

మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి సోమవారం మూడు నామినేషన్‌లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్వో, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు అభ్యర్థులు నామినేషన్‌పత్రాలు అందజేశారు. ములుగు నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్..బీజేపీ తరపున నామినేషన్‌లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పాల్వంచ దుర్గ రెండో సెట్ నామినేషన్ వేశారు. ఈనెల 19న మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. యూసీసీఆర్ఐఎంఎల్ పార్టీకి చెందిన పగిడి ఎర్రయ్య నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా మైపతి అరుణ్‌కుమార్ నామినేషన్ వేశారు. ఈనెల 18న ఒక్క నామినేషన్, 19న నాలుగు, , 20న నామినేషన్‌లు దాఖలు కాలేదు. ఈనెల 21న ఆదివారం సెలవు కావడంతో ఈనెల 22న (సోమవారం) మూడు నామినేషన్‌లు దాఖలయ్యాయని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు స్వతంత్ర అభ్యర్థి దుర్గ, కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 8 నామినేషన్లు 10 సెట్లు దాఖలయ్యాయి.



వరంగల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న పార్టీ నేతలు ఎర్రబెల్లి, వినయ్‌భాస్కర్ తదితరులు



మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, కళాకారులు

జనజాతర సభను విజయవంతం చేయాలి

- వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి తదితరులు

మడికొండ : కాజీపేట మండలం మడికొండలో ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్న ఓరుగల్లు జన జాతర సభను విజయవంతం చేయాలని వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కే.ఆర్.నాగరాజు, కడియం శ్రీహరితో కలిసి మడికొండలో సభ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రేవూరి మాట్లాడుతూ 24వ తేదీన వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారన్నారు. అనంతరం మడికొండలో సాయంత్రం 3 గంటలకు ఓరుగల్లు జన జాతర సభలో పాల్గొని, మాట్లాడుతారన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. కార్యక్రమంలో డీసీసీ వరంగల్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా అధికార ప్రతినిధి కూచన రవళి, నేతలు కత్తి వెంకటస్వామి, ఎం.పి ఆనంద్, స్థానిక నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గర్రం అమర్‌నాథ్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కుర్ల మోహన్, వస్కుల శంకర్, పల్లపు రాజేందర్, ఎడబోయిన ప్రభాకర్ పాల్గొన్నారు.

నామినేషన్‌కు భారీగా తరలిరావాలి

- బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్

హన్మకొండ: వరంగల్ పార్లమెంట్ స్థానానికి ఈ నెల 25న దాఖలు చేయనున్న నామినేషన్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలిరావాలని బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ ముఖ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామి రానున్నారన్నారు. మండలాల వారీగా సమావేశాలు నిర్వహించుకుని నామినేషన్ కార్యక్రమానికి తరలిరావాలన్నారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో.. పాలన చేత కాక చేతులు ఎత్తేసిందని విమర్శించారు. మోదీ పాలననే దేశ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, పార్లమెంట్ కన్వీనర్ కుమారస్వామి, వర్ధన్నపేట అసెంబ్లీ కన్వీనర్ కేశవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హామీ ఇచ్చారు.. మద్దతు ఇస్తున్నాం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

హసన్‌పర్తి : ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని బీజేపీ హామీ ఇవ్వడంతోనే ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రకటించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎస్‌తో పాటు అనుబంధ సంఘాల వరంగల్ పార్లమెంట్ సన్నాహక సమావేశం సోమవారం రాత్రి మండలకేంద్రంలో నిర్వహించారు. ఈసమావేశానికి మంద కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. వర్గీకరణకు ముప్పై ఏళ్లుగా పోరాటం చేస్తున్నప్పటికీ అధికార పార్టీలు పార్లమెంట్‌లో బిల్లు పెట్టేందుకు చొరవ తీసుకోలేదన్నారు. అయితే బీజేపీ మాత్రం వర్గీకరణకు కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చిందని దీంతో ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో మాదిగ జాతి బీజేపీకి ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. పల్లెపల్లెకు వెళ్లి బీజేపీ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం చేయాలని సూచించారు. కాగా బీఆర్‌ఎస్ ఉనికి కోల్పోయిందని, ఆ పార్టీకి ఓటేస్తే గెలిచిదే లేదు.. గెలిచిన దాని వల్ల ఎలాంటి లాభం లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇటు ఎన్డీఏ, అటూ ఇండియా కూటమిలో లేదని వాపోయారు. అలాగే మాదిగ జాతిని అడుగడుగునా అవమానపరిచిందన్నారు. మాదిగలకు ముఖ్యమంత్రి పదవీ ఇస్తామని హామీ ఇవ్వడమే కాకుండా ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని అణిచివేయడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ కనీసం ఒక్క మాదిగ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలను అణగదొక్కిందని, అధికారం , ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ మాదిగ రిజర్వేషన్ కోసం కనీసం పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని ఆరోపించారు. తెలంగాణలో మూడు లోక్‌సభ స్థానాలు ఎస్సీలకు రిజర్వ్ చేసినప్పటికీ ఒక్క స్థానం కూడా కేటాయించలేదన్నారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సురేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద కుమార్, మంద రాజు, రాజారపు భిక్షపతి, వేల్పుల సూరన్న, మేకల రమేష్, సాంబరాజు, నమిండ్ల సూర్యం తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీకి పాల్పడుతున్న దొంగ అరెస్ట్

- 14 సెల్‌ఫోన్లు, 29 గ్రాముల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ నరేష్, ఎస్సైలు

కాశిబుగ్గ : రైళ్లలో చోరీకి పాల్పడుతున్న దొంగను వరంగల్ రైల్వే పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి సుమారు రూ.3.66 లక్షల విలువైన సెల్‌ఫోన్లు, బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం.. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన దుర్గం ప్రశాంత్ సెంట్రింగ్ పని చేస్తుంటాడు. జల్సాలకు అలవాటు పడి డబ్బు సరిపోక చోరీలు చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈక్రమంలో వరంగల్‌కు వచ్చి ఓ ప్రైవేట్ హాస్టల్‌లో సెక్యూరిటీగా పని చేస్తున్నాని చెప్పి రాత్రి వేళ రైళ్లలో చోరీలకు పాల్పడుతున్నాడు. సోమవారం ఉదయం వరంగల్ రైల్వే స్టేషన్ 2,3వ ప్లాట్‌ఫాంలో వరంగల్ జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు చేపడుతుండగా ప్రశాంత్ హ్యాండ్ బ్యాగుతో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. దీంతో అతడిబ్యాగును తనిఖీ చేయగా 29 గ్రాముల బంగారం, 10 తులాల వెండి, ఒక వాచ్, 14 సెల్‌ఫోన్లు లభించగా స్వాధీనం చేసుకుని విచారించారు. దీంతో పలు రైళ్లలో చోరీ చేసినట్లు ఒప్పుకోవడంతో అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ నరేష్ తెలిపారు. ఈ తనిఖీల్లో జీఆర్పీ ఎస్సై ఐలయ్య, ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్‌కె సుభాని, హెడ్ కానిస్టేబుల్ ఎస్ రాజు, ఎన్ రమేశ్, మనోజ్‌కుమార్, డి రాము, ఎండీ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

అట్రాసిటి కేసు నమోదు

హసన్‌పర్తి : చింతగట్టులోని కాకోజీ జూనియర్ కళాశాల చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదైంది. నిబంధనలకు విరుద్ధంగా వేసవి తరగతులు నిర్వహిస్తున్నారని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రెండు రోజుల క్రితం ఆందోళన నిర్వహించింది. దీంతో ఆగ్రహానికి గురైన కళాశాల చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి ఆ సంఘం కేయూ విభాగం ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్‌ను కులం పేరుతో దూషించాడు. దీంతో బాధితుడు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శ్యాంసుందర్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: అనాథ, దివ్యాంగ బాలికలకు హైదరాబాద్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి మధురిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుకు గాను మే 17లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని జీ1 –జీ2 బ్లాక్‌లోని స్త్రీ, శిశు సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

విద్యుత్ భద్రత ప్రమాణాలు పాటించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ : ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రత ప్రమాణాలు పాటించాలని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి తల్లాడ సబ్‌స్టేషన్‌లో ప్రమాదవశాత్తు సిటీ పేలడంపై సీఎండీ స్పందించారు. పనిచేసే ప్రదేశంలో సేఫ్టీ గ్లౌజ్‌లు, హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. తల్లాడ సబ్ స్టేషన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ప్రొటెక్షన్) సమక్షంలో లైన్‌మన్ సిటీ వివరాలు నమోదు చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లినప్పుడు భద్రత నియమాలు పాటించాలని చెప్పకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని, సంబంధిత అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్: భార్యాభర్తల మధ్య గొడవ జరగగా మనస్తాపానికి గురైన భర్త ఉరేసుకుని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ గవిచర్ల క్రాస్‌రోడ్డులో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై మహిమూద్ కథనం ప్రకారం వరంగల్ గవిచర్ల క్రాస్ రోడ్డుకు చెందిన సారగందుల రవి (35), ఉమ దంపతులు అద్దె ఇంట్లో ఉంటున్నారు. శనివారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరగగా మామునూరులోని తన అక్క ఇంటికి ఉమ వెళ్లింది. ఆదివారం ఉదయం భార్యను ఇంటికి రావాలని రవి ప్రాధేయపడినా ససేమిరా అనడంతో మనస్తాపం చెందాడు. అద్దె ఇంటికి చేరుకుని ఫ్యాన్‌కు ఉరేసుకుని రవి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు సారగందుల సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహిమూద్ తెలిపారు.